www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

ఆదివారం | 21 | జూన్ | 2026 పేజీలు : 8

## సర్ పట్ల బిఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి



-ప్రతి ఓటు విలువైనదే

-బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన కార్యక్రమంలో మంత్రి తుమ్మల

2లో

# శాపమవుతున్న నిర్లక్ష్యం..!



-విశ్వసనీయత కోల్పోతున్న ప్రభుత్వాసుపత్రులు

-అవయవాలు లేదా ప్రాణాలే బలి

-విచారణ పేరుతో దోషులకు రక్ష



(ఫైల్)

**ప్రజాపక్షం/ఖమ్మం :** వైద్యులు, వైద్య సిబ్బంది నిర్లక్ష్యం రోగులకు శాపంగా మారుతుంది. వరుస ఘటనలతో ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలు విశ్వసనీయత కోల్పోతు న్నారు. జిల్లా కేంద్ర ఆసుపత్రుల నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించ కపోవటమే ఈ స్థితికి కారణమవుతుంది. వైద్యం ఇప్పుడు అతి ఖరీదైందిగా మారింది. ప్రైవేటు ఆసుపత్రి నిర్వహాకు లకు కాసులు కురిపిస్తుంది. ఒక రకంగా చెప్పాలంటే వైద్యం పేరుతో అతి పెద్ద దోపిడీ జరుగుతుంది. అవసరం ఉన్నా లేకపోయినా రకరకాల పరీక్షలు నిర్వహించటం పరీక్షా కేంద్రాలతో కుమ్మకై నీకింత నాకింత అన్న వ్యాపార ధోరణితో వ్యవహరిస్తున్నారు. వైద్యో నారాయణో హరి సూక్తిని మరిచి ప్రైవేటు ఆసుపత్రులు ధనార్జనే ధ్యేయంగా నిర్వహిస్తున్న

మిగతా 2లో..

## సీన్ రిపిట్ అవుతుంది..

# ఎట్టెట్టా..!



**ప్రజాపక్షం/ ఖమ్మం :** జిల్లాలో సీన్ రిపిట్ అవు తుంది. సరిగ్గా మూడేళ్ల క్రితం ఆరోపణలు చేసి న వారు ఇప్పుడు అధికా రంలో ఉంటే ఇప్పు డు ఆరోపణలు చేస్తున్న వారు విపక్షంలో ఉన్నారు. ఆరోపణలు చేసే వ్యక్తులు , ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు మారారు తప్ప విమ ర్శలు కొత్తగా కాదు. అవే పదాలు, ఇసుక దందా, మట్టి మాఫీయా, భూ ఆక్రమణలు, అధికార దుర్వినియోగం, ఎవరు విపక్షంలో ఉన్న ఇవే ఆరోపణలు చేయాలా మరేమి కొత్తవి లేవా అంటే లేవనే అనిపిస్తుంది. ఎవరు అధికారంలో ఉంటే వారి పంచన చేరి ఏదో ఒక మా ర్గంలో అక్రమంగా సంపాదించాలన్న యావ ఉన్న వా ళ్లు ఉన్నంత కాలం వారిని అధికారంలో ఉన్నోళ్లు ప్రోత్స హించినంత కాలం అవే విమర్శలు ఉంటాయి. ఖమ్మం నగరంలో భూ ఆక్రమణలు ఎదుర్కొంటున్న వారు అప్పుడు ఇప్పుడు అధికార ముసుగు వేసుకున్న వారే కావడం గమనార్హం. ప్రభుత్వ భూముల ఆరోపణలకు సంబంధించి అప్పుడు ఇప్పుడు అధికార యంత్రాంగం చేష్టలుడిగి చూస్తుండిపోతుంది తప్ప చేసేది శూన్యం. భూఆక్రమణ ఆరోపణలు వస్తే ఖమ్మం కార్పోరేషన్, రెవెన్యూ, నీటిపారుదల శాఖాధికారులు మౌనమే తమ నిర్ణయం అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీనితో అధికారం అడ్డుపెట్టుకుని ఏదో పోగేసుకోవాలని చూసిన వారి అధి కార మార్పిడికి కారణమైందన్న సంగతిని జ్ఞప్తికి తెచ్చుకో వాలి. పైరవీలు గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా పైరవీలు చేసి అధికార యం త్రాం గాన్ని తప్పిదారి పట్టించారు. ఇప్పుడు అదే జరుగు తుంది. నాయకులు వివిధ హోదాలలో ఉన్న వారు నిజా యితీగా ఉంటే సరిపోదు. ముందర ఆహా ఓహో అం టూ బ్రహ్మరథం పడుతూ వెనక మలీనం అంటించే వా రి పట్ల జాగ్రత్త అవసరం. అప్పటి మంత్రి రెగ్యులర్ చేయ మన్నారంటూ కొంత భూమి రెగ్యులర్ చేయించుకు న్నారు. ఇప్పుడు ప్రస్తుతం అధికారానికి దగ్గరై మరి కొంత భూమి కాజేసే పనిలో ఉన్నారు ఒకాయన. అప్పు డు, ఇప్పుడు, అక్కడ, ఇక్కడ ఒకాయనే. ఎప్పుడు అధి కార పక్షమే. ఇటువంటి వారే ఇప్పుడు ఎక్కువగా ఉన్నా రు. ఏమి తక్కువైందో మూడేళ్లు నిండకముందే వెనక ఉండి అసమ్మతి రాగాలు అందుకుంటూ గతమే నయం అంటున్నారు. గతమే నయమైతే ఎందుకు మారారంటే దిక్కులు చూస్తున్నారు. ఆరోపణలు రావడం అన్నింటిలో నిజాలు ఉండకపోవడం అందరికీ తెలిసిందే. కానీ అవే విమర్శలు, అవే రావటమే చర్చనీయాంశమయ్యా యి. మట్టి మాఫీయా, ఇసుక దందా ఏది ఆగలేదు. వా రు వె ళ్లే దారులు మారాయిఅంతే. రాజకీయాల్లో విమర్శ లుసహజంఅనుకుంటేమార్పులుసహజమే అవుతాయి.

# డమ్మి బోర్లకు విద్యుత్ కనెక్షన్..!

-ప్రశ్నించిన రైతుపై పోలీసులకు ఫిర్యాదు







**ప్రజాపక్షం/ తల్లాడ :** విద్యుత్ శాఖాధికారులు డమ్మి బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చిన విషయాన్ని ప్రశ్నించిన ఓ రైతుపై విద్యుత్ శాఖాధికారి పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. అన్నారుగూడెం గ్రామంలో విద్యుత్ శాఖాధికారులు కొన్ని డమ్మిబోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే క్రమంలో

మిగతా 2లో..

# శాపమవుతున్న నిర్లక్ష్యం..!



(మొదటిపేజీ తరువాయి)
క్రమంలో ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం పొందలేని వారు ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఖమ్మం ప్రధాన ఆసుపత్రిలో క్యాన్‌లా ఏర్పాటు చేసి పసికందుకు వైద్యం అందించే క్రమంలో వైద్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడటంతో ఆ పసికందు చేతిని కోల్పోయాడు. దీనిపై విచారణ సా....గుతుంది. మరో పసికందు విషయంలో వైద్యుల నిర్ల క్ష్యం కారణంగా తలకు గాయమై మానసిక వికలాంగుడిగా మారే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. రెండు రోజుల క్రితం గుండాల పిహెచ్‌సిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో నర్సు చేసిన వైద్యం రెండు ప్రాణాలను బలిగొన్నది. పసికందు ఆసుపత్రిలో ప్రాణా లు కోల్పోగా, తల్లిని ఖమ్మం తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయింది. ఆమె దహన సంస్కారాల తర్వాత చితాబస్మంలో ఆపరేషన్ చేసే కత్తెర దొరకటంతో వైద్యం చేసిన వారు కత్తెర వదిలేయటంతోనే రక్తస్రావమై ఆమె మరణించిందని బంధువులు ఆరోపిస్తున్నారు. దీనిపై ప్రాథమిక విచారణ జరిపిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్యాధికారి అసలు ఎటువంటి ఆపరేషన్ జరగలేదని కత్తెర శరీరంలో మర్చిపోవటానికి ఆస్కారమే లేదంటున్నారు. మరి ఆసుపత్రిలో ఉండాల్సిన కత్తెర చితాబస్మం లో ఎలా ఉందేంటే అదే అర్థం కావటం లేదంటున్నారు. మానవ హక్కు ల సంఘం స్పందిస్తే తప్ప అధికారులు కదలలేదు. ఇవికొన్ని ప్రాథమిక సాక్ష్యాలు మాత్రమే. వెలుగుచూడని ఘోరాలు ఎన్నో ఉన్నాయి.

**తరలింపే తప్పించుకునే మార్గం :**
తమ నిర్లక్ష్యంతో రోగి ప్రాణాల మీదకు రాగానే ప్రైవేటు ఆసుపత్రికి లేదంటే మరో ఆసుపత్రికి తీసుకుపోండి అంటూ రోగి బంధువులపై ఒత్తిడి తీసుకువస్తారు. ప్రాణాలకు ప్రమాదం లేదు కాని అంటూ నచ్చచెప్పి ఆసుపత్రి దాటించి ఊపిరి పీల్చుకుంటారు. తర్వాత ఏమి జరిగినా మా దగ్గర ఉన్నప్పుడు బాగానే ఉన్నారు ఆసుపత్రి అవల పరిణామాలకు మాది బాధ్యత కాదంటూ బుకాయిస్తారు. ఖమ్మంజిల్లాలో బాలుని చేయి తొలగింపు విషయంలో ఇదే జరిగింది. ప్రమాద పరిస్థితులు ఏర్పడినప్పుడు వరంగల్ ఎంజిఎం ఆసుపత్రికి పంపించారు. అక్కడ చేయి తొలగిస్తే మాకు ఏమి సంబంధం అంటూ తప్పించుకో చూస్తున్నారు.

**చర్యలలో జాప్యం :**
ప్రభుత్వ ఆసుపత్రులలో జరుగుతున్న ఘటనలకు సంబంధించి విచారణ పేరుతో రోజుల తరబడి సాగదీసి ఆ తర్వాత తుస్సుమనిపిస్తున్నారు. వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించినప్పుడు కానీ, విధులకు సరిగ్గా హాజరు కాకుండా మరే తప్పిదం చేసినా విచారణకు ఆదేశించారంటే విషయం మరిచిపోవాల్సిందే. చాలా సందర్భాలలో విచారణ అధికారి పంట పండి తృప్తిపరిచగలిగితే ఏ తప్పు చేసినా తప్పు లేకుండా బయటపడినట్లే. ఒక రకంగా చెప్పాలంటే ప్రభుత్వ వైద్యరంగంలో చర్యలు శూన్యం అని చెప్పవచ్చు. నిర్లక్ష్యం కారణంగానే ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిక్కిరిస్తుంటే ప్రభుత్వ ఆసుపత్రులకు రోగుల వచ్చేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రులను ప్రక్షాళన చేస్తే తప్ప తిరిగి విశ్వసనీయతను పొందలేరు.

# సర్ పట్ల బిఎల్‌ఏలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ (సర్) కార్యక్రమం పట్ల బూత్ లెవల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శనివారం వీడియోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఖమ్మం నియోజక వర్గ బూత్ లెవల్ ఏజెంట్స్ సమావేశానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు సమగ్ర సవరణ కార్యక్రమం పై బిఎల్‌ఏలు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. సర్ అస్త్రంతో పశ్చిమబెంగాల్, తమిళనాడులో రాజకీయ తలరాతలు మారాయన్నారు. మమత బెనర్జీ, స్టాలిన్ ప్రభుత్వాలు అధికారాన్ని కోల్పోయాయన్నారు. ఏఐసిసి, పిసిసి ఆదేశాల ప్రకారం సర్ కార్యక్రమంలో బూత్ లెవల్ ఏజెంట్లు, పార్టీ నాయకులు పాల్గొనాలన్నారు. బిఎల్వోలతో పాటు బిఎల్‌ఏలు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ కూడా జాగ్రత్తవహించాలన్నారు. అర్హులైన ప్రతి ఓటు కోల్పోకుండా చూడాలన్నారు. ఖమ్మం నియోజక వర్గంలో మూడు లక్షలకు పైగా ఓట్లు ఉంటే ఇప్పటి వరకు సగం ఓట్లు కూడా మ్యాపింగ్ జరగలేదన్నారు. నెల రోజుల పాటు బిఎల్‌ఏలు అప్రమత్తంగా ఉంటూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, ఎఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, నాయకులు పాల్గొన్నారు.

# డమ్మి బోర్లకు విద్యుత్ కనెక్షన్..!



(మొదటిపేజీ తరువాయి) చింతల నాగరాజు అనే రైతుకు చెందిన వ్యవసాయ భూమిలో విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేశారు. విద్యుత్ స్తంభాన్ని భూమి హద్దుకు దగ్గరలో ఏర్పాటు చేయడంతో నాగరాజు భూమి సరిహద్దుపై కానీ లేదా ఐదారు అడుగుల లోపల కానీ ఏర్పాటు చేయాలని అర అడుగు దూరం ఉంచితే హద్దుల సమస్య వస్తుందని అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. దానితో పాటు బోర్లే లేని చోట విద్యుత్ కనెక్షన్ ఎందుకని ప్రశ్నించారు. కొందరు బోర్లు వేయకుండానే విద్యుత్ కనెక్షన్ తీసుకుంటుండడంతో అది తన పొలం ద్వారా వెళ్తుండడంతో రైతు విద్యుత్ శాఖాధికారులను ప్రశ్నించారు. రైతు ప్రశ్నించడాన్ని విద్యుత్ శాఖ ఏఈ సహించలేకపోయారు. తల్లాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లాడ పోలీసులు గురువారం రైతు నాగరాజును పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పగలు మొత్తం పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. విషయం ఏమి చెప్పకుండానే మళ్లీ మరుసటి రోజు రావాలని ఆదేశించారు. ఏమి జరిగిందో కానీ రైతు వెళ్లకపోయినా పోలీసుల నుంచి కబురు రాకపోవడం గమనార్హం. డమ్మి బోర్లకు విద్యుత్ కనెక్షన్ ఇస్తున్నారని రైతు నాగరాజు విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడమే పోలీసులకు విద్యుత్ శాఖాధికారులు ఫిర్యాదు చేసేందుకు కారణమైందని తెలుస్తుంది. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే వ్యవహారమై పూర్తి స్థాయి విచారణ జరపాలని రైతు నాగరాజు కోరుతున్నారు. తనపై ఎందుకు పోలీసులకు ఫిర్యాదు చేశారో కూడా స్పష్టం చేయాలన్నారు.

## నీట్ అభ్యర్థులకు బస్సుల్లో ఉచిత ప్రయాణం

**మణుగూరు ఆర్టీసీ డిఎం శ్యాంసుందర్**



ప్రజాపక్షం/మణుగూరుః నీట్ యూజీ రీఎగ్జామినేషన్ కు హాజరయ్యే అభ్యర్థులకు నాన్ ఏసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించనున్నట్లు మణుగూరు ఆర్టీసీ డిఎం శ్యాంసుందర్ తెలిపారు . ప్రభుత్వ ఆదేశానుసారం ఆర్టీసీ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఆదివారం పరీక్ష జరగనుండగా హాల్ టికెట్ చూపించి విద్యార్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. దూరప్రాంతాలకు వెళ్లే విద్యార్థులు సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్ప్రెస్, పల్లె వెలుగు ఏ బస్సుల్లో అయినా రేపు మొత్తం ఉచితంగా ప్రయాణించవచ్చు అని తెలిపారు. ఈ అవకాశాన్ని నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పాఠశాలకు రూ.10వేలు చేయూత





ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ ఫిషరీస్ కాలనీ ప్రాథమిక పాఠశాల గోడలకు పెయింట్స్ కోసం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఖమ్మం వారు సాదినేని భాస్కరరావు అన్నపూర్ణమ్మ దంపతులు రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనిఆవసరావు, యలమద్ది వెంకటేశ్వర్లు వైవి చేతుల మీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నరసింహరావుకు అందించారు. ఈ సందర్భంగా పిఆర్పిఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వరుల వైవి మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధి కోసం ఆవాస ప్రాంతంలోని పెద్దల సహకారంతో పదిమంది నూతన విద్యార్థుల అడ్మిషన్లు చేసిన పాఠశాల ఉపాధ్యాయులు అభినందనీయమని తెలిపారు. అదేవిధంగా పాఠశాల గోడలకు పెయింట్స్ నిమిత్తం ఆర్థిక సహకారం అందించిన సాదినేని భాస్కరరావు, అన్నపూర్ణమ్మ దంపతుల ధాతృత్వం గొప్ప అభినందనీయమని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి చావా శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో చాలా పాఠశాలలకు మౌలిక వసతులకు సమకూర్చడంలో యలమద్ది వెంకటేశ్వర్లు వైవి అభినందనీయులని రిటైర్ అయినా సరే ఉపాధ్యాయుల కోసం పాఠశాల కోసం అనునిత్యం కష్టపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెలిశెట్టి నర్సింహారావు, ఉపాధ్యాయులు బీరెల్లి రామకృష్ణ, పిఆర్పి జిల్లా కోకన్వీనర్ కొండలరావు, పిఆర్‌టియు వైరా మండల మాజీ అధ్యక్షులు కొత్తా శ్రీనివాసరావు, పిఆర్‌టియు సీనియర్ బాధ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, మద్దినేని పాపారావు, తల్లాడ మండల పిఆర్‌టియు అధ్యక్షులు అద్దంకి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైరా సమాచారం

## గాంధీలాల్ చిత్రపటానికి నివాలి



ప్రజాపక్షం/వైరాః వైరా మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో ఇటీవల మరణించిన మున్సిపల్ కార్మికుడు గాంధిలాల్ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న బిఆర్‌ఎస్ నాయకులు గాంధిలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, వైరా పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దెల రవి, సక్కుబాయి, వేముల శివ ఉన్నారు.

## పాఠశాలకు కౌన్సిలర్ తిరుపతి శివకుమారి రూ.7వేలు చేయూత..



వైరా మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో ఉన్న ప్రభుత్వ పాఠశాల నందు విద్యార్థుల సౌకర్యార్థం ఆ వార్డు కౌన్సిలర్ తిరుపతి శివకుమారి శ్రీను పాఠశాలలోని నాలుగు బ్లాక్ బోర్డులు ఏర్పాటు చేశారు. బ్లాక్ బోర్డుల ఏర్పాటుకు గాను రూ.7వేలు వారు సొంతంగా అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ తిరుపతి శివకుమారి మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు మంచిగా ఉండాలి, బాగా చదువుకోవాలి, ఉపాధ్యాయులు వారి భవిష్యత్తుకు పునాది వేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## గాంధిలాల్ కుటుంబానికి నివాళులు అర్పించిన డాక్టర్ కాపా



వైరా మున్సిపాలిటీ కార్మికుడు జవాన్ గాంధి ఇటీవల మరణించాడు. ఆదివా రం గాంధిలాల్ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ కాపా మురళీకృష్ణ గాంధి కుటుం బ సభ్యులను పరామర్శించి అనంతరం గాంధి చిత్రపటానికి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో వుంద్రు శ్యామ్‌బాబు, 1వ వార్డు కౌన్సిలర్ మోరు శ్రీకాంత్, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరు రామకృష్ణ, బీక్యా తదితరులు ఉన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రంలో 23వ విడత పిఎం కిసాన్ సమ్మాన్ నిధి ప్రోగ్రాం




ప్రజాపక్షం/వైరాః కృషి విజ్ఞాన కేంద్రం వైరా నందు 23వ విడత పిఎం కిసాన్ సమ్మన్ నిధి ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవికె వైరా సీనియర్ శాస్త్రవేత్త పావని మాట్లాడుతూ భూమి సారం తగ్గిపోతుంది, మన భూమిని కాపాడుకోవాల్సిన అవసరం, ఆవశ్యకత గురించి, డిజిటల్ అగ్రికల్చర్ మిషన్స్, పప్పు ధాన్యాల్లో ఆత్మ నిర్భర భారత్ ప్రోగ్రాం, తక్కువ రసాయన ఎరువుల వాడకం, రైతులు సేంద్రీయ వ్యవసాయం వైపు మారాలని సూచించారు. శాస్త్రవేత్త పిఎస్ఎం ఫణి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యత, ప్రస్తుతం ఖరీఫ్‌లో వేసుకోవాల్సిన, అపరాల రకాల గురించి వివరించడం జరిగింది. వైరా మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ సేంద్రీయ ఎరువుల వాడకం వాటి ఆవశ్యకత నేల ఆరోగ్యం గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫ్యాక్ట్ మేనేజర్ నాగార్జున, ఖమ్మం జిల్లా ప్రతినిధి రామకృష్ణ, గొల్లపూడి గన్నవరం విస్తరణ అధికారులు ఎం.రాజేష్, వెంకటనరసయ్య, కెవికె సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తింపులేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోండి




**-పుస్తకాలు, యూనిఫాం పేరుతో దోపిడీ**
**-ఉదాసీన వైఖరిలో విద్యాశాఖ**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గుర్తింపు లేని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ ఉదాసీన వైఖరిని అవలంభిస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో శనివారం ఏఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా దోపిడీకి తెరలేపాయన్నారు. అడ్మిషన్ నుంచి యూనిఫామ్స్ వరకు పుస్తకాల నుంచి బస్సు ఫీజుల వరకు ఆదాయ వనరుగా మార్చుకున్నాయన్నారు. అధిక ఫీజుల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఫీజుల దోపిడీని అరికట్టాల్సిన విద్యాశాఖ మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందన్నారు. అనుమతులు లేకపోయినా పెద్ద పెద్ద భవనాల్లో పాఠశాలలను ఏర్పాటు చేయడం, రంగు రంగుల బ్రోచర్లు, హోర్డింగ్స్‌తో విద్యార్థులు, తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయన్నారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై దాడులు నిర్వహిస్తామని రామకృష్ణ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యులు బుర్రా మనోజ్, శివానాయక్, పవన్, గోపి, చైతన్య, వెంకట్, రాంబాబు, రాము, నరేందర్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** మండల పరిధిలోని వేపకుంట్ల పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. శనివారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పొట్లపల్లి రమాదేవి రాజా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులకు హక్కుల గురించి వివరించారు. నూతన అడ్మిషన్ల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను ప్రైవేటుకు దీటుగా అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్స్ వంటివి అందిస్తుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపి ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ సందర్శించి అక్కడ మౌలిక వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అశ్వని, ఉపాధ్యాయులు, సందీప్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి

**-టోల్ ఫ్రీ నెం.1077కు కాల్ చేయాలి**
**-డిఆర్‌వో రామ్మూర్తి**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** జిల్లాలో అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో జిల్లా కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ రామ్మూర్తి శనివారం తెలిపారు. జిల్లా కంట్రోల్ రూమ్ 24 గంటల పాటు మూడు షిఫ్ట్‌లలో నిరంతరాయంగా పనిచేస్తుందన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రకృతి వైపరీత్యాలు తదితర అత్యవసర పరిస్థితుల సమాచారాన్ని ప్రజలు వెంటనే కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు టోల్ ఫ్రీ నెం.1077 లేదా మొబైల్ నెంబర్ 9063211298కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చునని తెలిపారు. వ్యవసాయానికి సంబంధించి జిల్లాలో నకిలీ విత్తనాలు, నకిలీ ఎరువుల విక్రయాలు, ఇతరాలపై కూడా ప్రజలు కంట్రోల్ రూమ్‌కు ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కంట్రోల్ రూమ్‌కు వచ్చే ప్రతి కాల్, ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖలకు సమాచారం అందజేసి సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో కంట్రోల్‌రూమ్‌సేవలనుసద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై పిడిఎస్‌యు సర్వే




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలపై పిడిఎస్‌యు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. శనివారం ఖమ్మం నగరంలోని రిక్కాబజార్, మామిళ్లగూడెం, రోటరీ నగర్, ఇందిరా నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు గోకినేపల్లి మస్తాన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిందని కానీ విద్యార్థులు నేటికి అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు సరిగ్గా పుస్తకాలు అందుబాటులో లేవని, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సమస్య ఉందన్నారు. మెనూ ప్రకారం భోజనం కూడా అందించడం లేదన్నారు. ప్రైవేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. అనుమతులు లేకుండా ప్రైవేటు పాఠశాలలు నడుస్తున్నా జిల్లా అధికారులు వాటి మీద చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం, బుక్స్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రెగ్యులర్ ఎంఈవోలు లేరని రెగ్యులర్ డిఈవో పోస్టును భర్తీ చేయాలన్నారు. లేని పక్షంలో పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశ్వంత్, తరుణ్ పాల్గొన్నారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని అమలు పరచడమే ఎస్ఐఆర్ లక్ష్యం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రాజ్యాంగ స్ఫూర్తి ప్రకారం ఒక్కరికి ఒకే ఓటు అనే నినాదంతో అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో పాటు ఎన్నికల వ్యవస్థను మరింత పటిష్టం చేయడం జరుగుతోందని తహశీల్దార్ వినయేందర్‌రెడ్డి అన్నారు. శనివారం ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఖమ్మంరూరల్ మండలంలోని 101పోలింగ్ బూత్‌లకు సంబంధించిన బీఎల్ఓలు, బీఎల్ఏలు, ప్రజాప్రతనిధులు, కౌన్సిలర్లతో ఓటరు జాబితా నవీకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఖచ్చితత్వం పెంచేందుకు అమలు చేస్తున్న వ్యవస్థ ఓటు హక్కుకు భద్రత కల్పించే విధంగా పనిచేస్తుందన్నారు. గతంలో నమోదైన ఓటర్ల వివరాలను ఆధారంగా తీసుకొని సంబంధిత వయస్సు ధృవీకరణ పత్రాలను బీఎల్ఓలు సేకరించి మ్యాపింగ్ ప్రక్రియ చేపడతారన్నారు. అలాగే కుటుంబంలో ఇప్పటికే ఓటు హక్కు కలిగిన సభ్యుల ఆధారంగా ఇతర అర్హుల వివరాలను గుర్తించి, నమోదు చేయడం జరుగుతుందన్నారు. చిన్నారులు లేదా తలిదండ్రులు అందుబాటులో లేని పరిస్థితుల్లో కుటుంబ సభ్యుల వివరాలను పరిగణలోకి తీసుకొని ధృవీకరణ ప్రక్రియ నిర్వహిస్తామని వివరించారు. ప్రజాప్రతినిధులు, బీఎల్ఓలు పూర్తి అవగాహణతో పని చేసి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా కృషిచేయాలని సూచించారు. అనంతరం నిపుణల ద్వారా ఓటరు జాబితా నవీకరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ రవీందర్, ఆర్ఐ జానీ, జీపీఓ కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి సిరికి సన్మానం



**ప్రజాపక్షం/బోనకల్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సిఎం కప్ క్రీడా పోటీలలో జానకీపురం గ్రామానికి చెందిన గద్దల సిరి బ్రాంజ్ మెడల్ సాధించింది. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం సిరిని సర్పంచ్ సులోచనదావీదు, పాలకవర్గం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సులోచనదావీదు మాట్లాడుతూ సిరి క్రీడా పోటీలలో రాష్ట్ర స్థాయి గోల్డ్ మెడల్స్‌తో పాటు అనేక పతకాలు సాధించంది జాతీయ స్థాయి పోటీలలో రాణించదన్నారు. అండర్ 17 విభాగంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల వేదికగా జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడలలో పాల్గొని తన ప్రతిభరించదని అన్నారు. సిరి మరిన్ని విజయాలు సాధించాలని, జానకీపురం గ్రామానికి మరింత పేరుప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో సిరిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఏఎస్ఐ కర్లకుంట దావీదు, ఉపసర్పంచ్ భూపతిరావు, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/పినపాక:** పినపాక మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. యోగా సాధన వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, నిత్య జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని యోగా ఆసనాలు నిర్వహించారు. యోగా దినోత్సవం సందర్భంగా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.

# పెనుబల్లి మండలంలో భారీ గాలి, వర్షం

## నేల కొరిగిన వృక్షాలు



**ప్రజాపక్షం/పెనుబల్లి:** మండలంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం, గాలి దుమ్ముతో వందల ఏళ్ల నాటి వృక్షాలు కూలి పో యాయి. సత్తుపల్లి, ఖమ్మం హైవే రోడ్డు లో అనేక చెట్లు పడి పోయా యి. విద్యుత్ కు తీవ్ర అంతరాయం కలిగింది. వాహనాల రవాణాకు సైతం తీవ్ర అంతరాయం కలిగింది. పోలీస్ శాఖ వెంటనే స్పందించి ప్రజలకు ఆటంకం లేకుండా ట్రాఫిక్ ఏర్పాటు చేశారు. కొన్ని గంటల సమయం లోనే విద్యుత్ పునరుద్దరించారు. గ్రామీణ ప్రాంతంలో లింగగుడెం, గంగదేవిపాడు, లంకాసాగర్, కొంద్రుపాడు రోడ్లు వెంబటి చెట్లు కూలి అంతరాయం కలిగింది. కొన్ని గ్రామాల్లో ఇంటి ముందు చెట్లు కూలి ఇంటి పైన పడ్డాయి. తెల్లవార్లు గాలి వర్షం తో పాటు ఉరుములు, మెరుపులతో ప్రజలు భయఆందోళన్లు చెందారు. రాత్రి సమయం కావటం ప్రజలు ఇళ్ళకు చేరుకున్న తరువాత వర్షం గాలి, దుమ్ము, ఉరుములు మెరుపులు రావటం తో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక పోలీసులు అప్రమత్తంతో విద్యుత్, రవాణా, కూలిన చెట్లు వెంటనే తొలిగించటంతో ఆటంకాలు లేకుండా చేశారు.



# టాలెంట్ విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో బాసర ఐఐటీలో సీటు సాధించిన సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థి నారపోగు రామ్ చరణ్ తేజ్ ను సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ లు అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు టాలెంట్ స్కూల్ ప్రిన్సిపాల్ పులి శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే దంపతులు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కృషి, పట్టుదలతో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని, రామ్ చరణ్ తేజ్ సాధించిన విజయం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రిహానా బేగం పాల్గొని విద్యార్థిని, పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించి సత్తుపల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఆరెంపులలో అమ్మమాట అంగన్వాడీ బాట



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలం ఆరెంపులగ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో అమ్మమాట అంగన్వాడీ బాట వేడుకను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రాన్ని పండుగవాతావరణం ఉట్టిపడేలా అలంకరించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ బండి సతీష్, ఉప సర్పంచ్ దావుద్ ముఖ్య అతిధులుగా హాజరయ్యి చిన్నారులతో విద్యాభ్యసం చేపించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాలతి, గర్భిణీలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గాలివాన బాధితులకు అండగా సర్పంచ్



**ప్రజాపక్షం/ములకలపల్లి:** మండల పరిధి లోని జగన్నాధపురం గ్రామ పంచాయితీ పరిధిలో గాలివానతో దెబ్బతిన్న రేగులగుంట, తోగ్గూడెం, చింతలగుప్ప, నర్సాపురం గ్రామాల్లోని ఇళ్లను జగన్నాధపురం సర్పంచ్ కుంజా వినోద్ పరిశీలించి, బాధితులను పరామర్శించారు. నర్సాపురం గ్రామానికి చెందిన లగడపాటి భాస్కర్ కుటుంబ సభ్యులను ఓదార్చిన ఆయన, నర్సాపురం ప్రభుత్వ పాఠశాలను సందర్శించి ప్రహరీ గోడ నిర్మాణాన్ని త్వరలో మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి సునీష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న తాటి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలం రాచన్నగూడెం గ్రామంలో నిర్వహించిన నాభిశీల బొడ్రాయి, ముత్యాలమ్మ, శ్రీ పోతురాజు స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో అశ్వారావుపేట మాజీ ఎంఎల్ఏ, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి రూ 10వేల విరాళం అందజేసి, మహోత్సవంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముత్యాలమ్మ, శ్రీ పోతురాజు స్వామివారి ఆశీస్సులతో రాచన్నగూడెం గ్రామ ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో రాచన్నగూడెం సర్పంచ్ మడకం విజయ, ఉప సర్పంచ్ వగ్గేలా వెంకటేష్, మాజీ సర్పంచ్ బైటి రాజేష్, జగన్నాధపురం సర్పంచ్ కుంజా వినోద్, పోతుగంటి లక్ష్మణ్, మీడియం బాబురావు, వగ్గేల వీరస్వామి, మడకం లక్ష్మణ్, ఊకె శ్రీను, మీడియం శ్రీను, ఊకె పరశురామ్, ఊకె శివ, కోర్స చెందు, కోర్స వెంకటేష్, ఊకె విజయకుమారి, సుశీల, ఆదిలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో గర్భిణీ మృతి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** అనారోగ్యంతో గర్భిణీ మృతి చెందిన ఘటన శనివారం మండలంలో వెలుగులోకి వచ్చింది. మృతురాలి బంధువులు, గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామానికి చెందిన కారం భవాని(30)ఆరు నెలల గర్భిణీ గత నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో కొత్తగూడెం, ఖమ్మం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ, ఇటీవల వైద్యుల సూచనల మేరకు వరంగల్‌లో ఎంజిఎం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. శనివారం బెండాలపాడు మృతదేహాన్ని తీసుకొచ్చి దహనం చేశారు. గర్భిణీగా ఉన్న కారం భవానికి సరియైనా వైద్య సలహాలు ఇవ్వకపోవడం వల్లనే అనారోగ్యంతో మృతి చెందిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గర్భిణీల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది, వైద్యులు పట్టించుకోకపోవడం వల్ల గ్రామాల్లో, ముఖ్యంగా గిరిజన గ్రామాల్లో గిరిజన మహిళలు మృత్యువాత పడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వాస్తవ కోణంలో విచారణ చేపడితే నిజాలు బయటకు వస్తాయని గ్రామస్తులు చర్చింకుంటున్నారు.

**మెడికల్ ఆఫీసర్ రాము వివరణ....**

చంద్రుగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో కారం భవాని గర్భిణీగా నమోదు అయింది. నాలుగో నెలలో పాల్వంచలోని మృతురాలి అమ్మ ఇంటికి వెళ్లింది. అనారోగ్యంతో కొత్తగూడెం, ఖమ్మం ఆసుపత్రుల్లో వైద్యం చికిత్స అనంతరం వరంగల్ ఎంజిఎంకి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృత చెందింది. ఇందులో ఎవరి నిర్లక్ష్యం లేదని తెలిపారు.

## యోగాతో ఏకాగ్రత, ఆత్మ విశ్వాసం పెరుగుతాయి



**ప్రజాపక్షం/కూసుమంచి :** కూసుమంచి మండల కేంద్రంలోని గ్లోబల్ రెయిన్‌బో స్కూల్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగాసనాలు ప్రదర్శించారు. ఈసందర్భంగా గ్లోబల్ రెయిన్‌బో స్కూల్, జీవీఆర్ కళాశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఎర్షాద్ అహ్మద్ మాట్లాడుతూ యోగా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. ప్రతి రోజూ యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంతో పాటు ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరిగి విద్యార్థులు చదువుపై మరింత దృష్టి సారించగలరని పేర్కొన్నారు. యోగాను దినచర్యలో భాగంగా చేసుకోవాలని సూచించిన ఆయన, విద్యార్థులతో వివిధ ఆసనాలు చేయించి వాటి ప్రయోజనాలను వివరించారు. యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జులు జహ్నవి, పాపారావు, నాజియా ఆఫ్రిన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తాం..అవినీతిని వ్యతిరేకిస్తాం

-మహిళా కౌన్సిలర్‌కి ఇచ్చే మర్యాద ఇదేనా?
-ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రజాప్రతినిధులకు లేదా?
-మహిళల పట్ల వ్యంగ్యంగా మాట్లాడటం ఏమిటి?
-అధికారులు పాలకవర్గ సభ్యుల మాటను పట్టించుకోరా?
-తప్పుడు బిల్లులు పెడితే ఎక్కడికైనా వెళతాం..నిలదీస్తాం



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తాం అభివృద్ధికి అండగా ఉంటాం కాని అవినీతిపై నిలదీస్తాం ఎదురు తిరుగుతాం అడ్డుకుంటాం అని వైరా మున్సిపాలిటీ పరిధిలోని బిఆర్ఎస్, సిపిఎం, సిపిఐ కౌన్సిలర్లు తెలిపారు. శనివారం వైరాలో బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నందు జరిగిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు కట్టా స్వరూపరాణి, మాదినేని సునీత, తిరుపతి శివకుమారి, నల్లమోతు శైలజ, చిలకా కోటయ్య, కిన్నెర కృష్ణ, దొంతెబోయిన వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీ రెండో సాధారణ సమావేశం శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో జరిగింది. ఈ మున్సిపాలిటీ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్ల అభిప్రాయాలు తెలుసుకోకుండా ఎవరిని ఎలాంటి సమస్యలు అడగకుండా నిబంధనలకు విరుద్ధంగా ఒకేసారి 95 అంశాలను ఎజెండాలో పెట్టడంతో కౌన్సిలర్లు అభ్యంతరం తెలపడం జరిగిందని, ఇదే క్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ చాంబర్‌లో మహిళా కౌన్సిలర్లు కూర్చొని సమస్యలపై అంశ ములు పెడితే బాగుండేదని చర్చిస్తుండగా డాక్టర్ చంద్రకళ భర్త కాపా మురళీకృష్ణ కౌన్సిలర్లకు భిన్నంగా మాట్లాడుతూ ఎగతాళి చేసే విధంగా కోపగించుకుంటూ మాట్లాడి మహిళలు అనేది కూడా చూడకుండా ఆయన ప్రవర్తించిన తీరు సక్రమంగా లేదని అన్నారు. ప్రజాస్వామ్యంలో మహిళలు ప్రజాప్రతినిధులు అవ్వడానికి మహిళా కోట రిజర్వేషన్లు కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన చట్టాలు మహిళలకు ఉపయోగపడకుండా మహిళల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వ్యక్తులపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుంది అని ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులు మాట్లాడే స్వేచ్ఛను బందిస్తారా మాట్లాడుతుంటే మైకులు గుంజుకోమని చెప్పే హక్కు బయట వ్యక్తులకు ఎక్కడ ఉంది. సమావేశం జరిగే గదిలోకి సంబంధం లేని బయట వ్యక్తులు ఏ విధంగా మున్సిపల్ కౌన్సిల్‌లో కూర్చొంటారు. వారికి ఏ విధంగా కమీషనర్ అనుమతి ఇచ్చారు. మీడియా ప్రతినిధులను బయటికి పొమ్మని చెప్పిన కమీషనర్‌కు లోపల పాలకవర్గం కాకుండా బయట వ్యక్తులు ఉన్నప్పుడు ఎందుకు పంపించలేదు. మాట్లాడుతుంటే మర్యాద ఏకుండా వెనక నుంచి చెప్పడం ప్రజాస్వామ్యంలో విరుద్ధం కాదా అని వారు అన్నారు. మున్సిపల్ పాలకవర్గంలో 12 మంది మహిళా కౌన్సిలర్లు ఉన్నారు. రాజకీయాలకు అతీతంగా వారికి ప్రజాస్వామ్య విలువలను ఇవ్వవలసిన బాధ్యత లేదా అని ప్రశ్నించారు. మున్సిపల్ కమీషనర్ రామచంద్రరావు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఆయన పద్ధతిపై అధికారులకు ఫిర్యాదు చేస్తాం. చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని చెబుతున్నారు. అలంటప్పుడు మహిళలకు ఎందుకు గౌరవనీయకుండా ప్రవర్తిస్తున్నారు. ఒక్కసారి ఆలోచించాలని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎలాంటి సమావేశాలు జరిగిన ప్రజాప్రతినిధులే మాట్లాడాలి. మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడాలి. ఆమె చెప్పిందే మేము వినాలి సమస్యలపై చర్చించాలి. కాపా మురళీకృష్ణ మున్సిపాలిటీ విషయంలో జోక్యం చేసుకునే హక్కు లేదు, సంబంధం లేని పాలకవర్గ సభ్యులు ఎవరైనా మున్సిపాలిటీలో సమావేశాలకు వచ్చిన మున్సిపాలిటీ పనుల్లో జోక్యం చేసుకున్న సహించేది లేదన్నారు. కౌన్సిలర్లకు ఇచ్చే మర్యాద ఇదేనా ప్రజాప్రతినిధులుగా ప్రజలు పనిచేస్తారు అని ఎన్నుకున్నారు. ప్రజాప్రతినిధులు సమస్యలను పరిష్కరించడానికి ఎన్నుకుంది, ప్రజాప్రతినిధులు కాని వ్యక్తులు విలువలకు ఎందుకు మున్సిపల్ అధికారులు విలువలు ఇస్తున్నారు. దీనిపై కూడా జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరిస్తామన్నారు. మున్సిపాలిటీలో అవినీతి కార్యక్రమాలకు చేయాలని చూస్తుంటే మేము చూస్తూ ఊరుకోము, ప్రతి పైసా మున్సిపాలిటీకి ఉపయోగపడే విధంగానే కల్పించాలి. అందరు పాలకవర్గ సభ్యులతో కలిసి పోరాడతాం, పార్టీలు ముఖ్యం కాదు పరిపాలన ముఖ్యం. మున్సిపాలిటీ అభివృద్ధి ముఖ్యం ఇది గుర్తుంచుకోవాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, మండల బిఆర్ఎస్ మాజీ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, మాదినేని దుర్గాప్రసాద్, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, మరికంటి శివ, అప్పం సురేష్, ఏదునూరు శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు కొంగర సుధాకర్, సిపిఐ నాయకులు నల్లమోతు సురేష్, బిఆర్ఎస్ నాయకులు మిట్టపల్లి కిరణ్, నూకల వాసు, కారుకొండ బోస్, వజినేపల్లి చక్రవర్తి, కట్టా నాగేశ్వరరావు, వేముల శివ, వాంకుడోతు వీరన్న, బానోతు శివ, నల్లగొండ నాని, ముదిగొండ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈ-కెవైసి పేరుతో గ్యాస్ ఏజెన్సీ దోపిడీని అరికట్టండి..!

**ప్రజాపక్షం/మణుగూరుః** పినపాక నియోజకవర్గం లోని హెచ్ పీ, భారత్ గ్యాస్, అలాగే జీసీసి ఆధ్వర్యంలో నడిచే ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలలో నిర్వాహకులు డోర్ డెలివరీ పేరుతో వినియోగదారుల నుండి ముక్క పిండి అక్రమ వసూళ్లకు పాల్పడు తున్నారని,అలాగే అశ్వాపురం మండలం లోని అభిరామ్ గ్యాస్ ఏజెన్సీలో ఈకెవైసి పేరుతో వినియోగదారుల నుంచి అక్రమం గా డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరో పణలపై సంబంధిత అధికారులు వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త, న్యాయవాది, కర్నె రవి డిమాండ్ చేశారు. శనివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశిత ధరలకు గ్యాస్ కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు డెలివరీ పేరుతో ఒక్కో గ్యాస్ పై రూ. 50 నుండి 100 రూపాయలు అదన పు డబ్బులను వసూలు చేయడం, అభి రామ్ హెచ్.పీ గ్యాస్ ఏజెన్సీ లో గ్యాస్ కనెక్షన్‌కు సంబంధించిన ఈకెవైసి ప్రక్రియ నిర్వహిం చేందుకు వినియోగదారుల నుంచి 200 రూపాయలు అదనపు చార్జీలు వసూలు చేయడం సరైన విధా నం కాదని ఆయన పేర్కొన్నారు. అలాగే ఈకెవైసి పూర్తయిన తర్వాత అవసరం లేకపోయినా గ్యాస్ పైపులను వినియోగ దారులకు అందిస్తూ అదనపు భారం మోపుతున్నారని ఆరో పించారు. ప్రభు త్వ సేవలను ప్రజలకు పారదర్శకంగా అందించాల్సిన సమయం లో కొందరు నిర్వాహకులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడటంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు అదనపు భారంతో ఆర్థికంగా నష్టపోతారని కర్నె రవి అన్నా రు. ఈ అంశంపై పౌరసరఫ రాల శాఖ, ఆయిల్ కంపెనీల ఉన్నతాధికారులు స్పందించి వాస్తవాలను వెలికి తీసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల హక్కులను కాపాడేం దుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, గ్యాస్ సిలిండర్ పై అదనపు వసూళ్లు, ఈకెవైసి పేరుతో జరిగే అక్రమ వసూళ్లను అరికట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అంతేగాక కొందరు గ్యాస్ నిర్వాహకులు బ్లాకు మార్కెట్ లొ ఒక్కో సిలిండర్ 15 వందల నుండి 2000 రూపాయలకు విక్ర యిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని అక్రమ వసూళ్లు చేయడం సహించరానిదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవా లని పేర్కొన్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లై డిటి తక్షణమే స్పందించి గ్యాస్ ఏజెన్సీ లలో తనిఖీలు నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో గ్యాస్ ధరలను ఉంచా లన్నారు. లేనిచో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## గిరిజనుల ఆరోగ్యంపై కక్షగట్టిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/జూలూరుపాడుః** జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 8 స్టాఫ్ నర్స్ పోస్టులకు గాను 6 పోస్టులు ఖాళీగా ఉంచడం తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వానికి గిరిజనుల ఆరోగ్యంపై ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు బానోత్ దుర్గాప్రసాద్ నాయక్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడుతూ జూన్ 2026 సాధారణ బదిలీల్లో జూలూరుపాడు పీహెచ్సీ నుండి 6 మంది నర్సులను బదిలీ చేశారని, వారి స్థానంలో ఒక్కరిని కూడా రీప్లేస్ చేయలేదని, ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్నది ఇద్దరే సిబ్బంది 75% సిబ్బంది లేకుండా 24X7 ఆసుపత్రి ఎలో వైద్య సేవలు ఎలా అందిస్తారని ప్రశ్నించారు.48 గంటల్లో డిప్యుటేషన్‌పై కనీసం సిబ్బందిని నియమించాలని, జూన్ 30లోగా మొత్తం 6 ఖాళీలను రెగ్యులర్ నియామకాలతో భర్తీ చేయాలని, షెడ్యూల్ ఏరియాల్లోని అన్ని పీహెచ్సీ లలో జీరో వెకెన్సీ పాలసీ అమలు చేస్తూ జీవో విడుదలచేసి పరిష్కరించకపోతే 30వ తేదీన జూలూరుపాడు పీహెచ్సి ఎదుట వంటా వార్పు కార్యక్రమంతో ఉద్యమం ప్రారంభిస్తామని, ఆ తర్వాత జిల్లా వ్యాప్తంగా రిలే దీక్షలు, కలెక్టరేట్ ముట్టడి ఉంటుందని గిరిజనుల ఉసురు ప్రభుత్వానికి తగులుతుందని అని దుర్గాప్రసాద్ నాయక్ తెలిపారు.



# స్వాతిలో అరుదైన ట్రామా బ్రెయిన్ సర్జరీ

-న్యూరో వైద్యసేవల్లో స్వాతి భేష్..!
-ప్రముఖ మెదడు, వెన్నుముక శస్త్రచికిత్స వైద్యనిపుణులు వి భాస్కర్





**ప్రజాపక్షం/ఖమ్మం వైద్యవిభాగంః** మెదడు రక్తస్రావం ఎవరికైనా ఎప్పుడైనా జరగవచ్చు. మెదడులోని రక్తనాళాలు పగిలి, పుర్రె లోపల రక్తస్రావం అయినప్పుడు ఈ తీవ్రమైన వైద్య పరిస్థితి ఏర్పడుతుంది. బ్రెయిన్ హెమరేజ్ అనేది ప్రాణాంతకమైన అత్యవసర పరిస్థితి, దీనికి తక్షణ వైద్యమ సహాయం అవసరం. ఇది రోగి జీవన నాణ్యతను ప్రభావితం చేస్తుంది. అందువల్ల మెదడు రక్తస్రావం కారణాలు, లక్షణాలు మరియు అందుబాటులో ఉన్న చికిత్సలను అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. లక్షణాలలో ఒకటి ముఖ్యంగా తీవ్రమైన తలనొప్పి, గందరగోళం, తిమ్మిర్లు వంటి ఏవైనా అకస్మాతుగా లక్షణాలు, రెండవ లక్షణం ప్రమాదానికి గురై తలకు గాయం లేదా తలపై దెబ్బ తగిలడం గమనించినట్లయితే అత్యవసర వైద్యం పొందాల్సిన విషయం.

**-అరుదైన బ్రెయిన్ ట్రామా సర్జరీ**

ఇటీవల సూర్యాపేట జిల్లా, హూజుర్‌నగర్ మండలంలోని బుర్రుగడ్డ గ్రామానికి చెందిన కోడి రాంబాబు రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కావడంతో హుటాహుటిన ఖమ్మం నగరంలోని స్వాతి మల్టీస్పెషాలిటీ హాస్పటల్‌కి తీసుకొని వచ్చి కుటుంబసభ్యులు అత్యవసర వైద్యం చేయించారు. రాంబాబుకు తీవ్రమైన తలగాయంతో మెదడులో రక్తకట్టడం, పుర్రె పగిలి మెదడులోకి చొచ్చుకుపోవడం, మెదడులో వాపు పెరిగి ప్రాణాలు ముప్పు సంభవించడంతో స్వాతి వైద్య బృందం కఠినమైన అత్యవసర శస్త్రచికిత్సను విజయవంతంగా చేసి ప్రాణాలు కాపాడారు. అనంతరం వెంటిలేటర్ 2 రోజులు, మరో 8 రోజులు ఐసీయూలో వైద్యసేవలు పొందిన తర్వాత రాంబాబు నార్మల్‌స్థితికి చేరుకున్నాడు. మరో కొద్ది రోజుల్లో మెదడు సాధారణ స్థితికి రావడానికి మరి కొంత సమయం పడుతుందని వైద్యులు భాస్కర్‌రెడ్డి తెలిపారు. రాంబాబు గ్రామంలోనే పంక్చర్లు వేయడం, గాలిమిషన్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఎండలు తీవ్రంగా ఉండడం, బిపి పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనం ఢీ కొట్టడంతో తలకు తీవ్రగాయమైంది. ఈ అరుదైన అత్యవసర శస్త్రచికిత్స, వెంటిలేటర్, ఐసీయూ వైద్యం, మందులు, రక్తపరీక్షలు, స్కానింగ్ ఇతర వైద్య ఫీజులన్ని కలిపి మొత్తంగా రూ.1.75వేలు మాత్రమే అయింది. హైదరాబాద్, కార్పోరేట్ ఆసుపత్రిలలో రూ.5 లక్షలు నుంచి 7 లక్షలపైగానే అవుతుందని వైద్యులు తెలిపారు.

**-ట్రామా, ఎమెర్జెన్సీ అధునాతన వైద్యం..**

ట్రామా మరియు ఎమెర్జెన్సీలు స్వాతి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో అధునాతమైన అత్యవసర చికిత్స కేంద్రాన్ని కలిగి ఉంది. స్వాతిలో రోడ్డు ప్రమాదాలతో సహ అనేక రకాల అత్యవసర ఆరోగ్య పరిస్థితులకు చికిత్స చేస్తుంది. న్యూరో సర్జరీ కీలకపాత్ర పోషిస్తున్న మల్టీపుల్ డిపార్ట్‌మెంట్స్ సమన్వయంతో రోడ్డు ప్రమాదాలు, తల గాయాలు, ప్రమాదవశాత్తూ పడిపోవడం కేసులను విజయవంతంగా రికవరీ చేస్తుంది. స్వాతిలో ఎక్కువగా తలకు గాయాలైన ఇంట్రాక్రానియల్ ప్రెజర్, నిరోధిత సెరిబ్రల్ రక్త ప్రవాహంతో బాధపడుతుండే కేసులకు ప్రత్యేక వైద్యం అందిస్తున్నారు. న్యూరో సర్జరీలు అనంతరం రోగులకు మానిటరింగ్ సిస్టమ్‌తో కూడిన ప్రత్యేక ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను కలిగి ఉంది. సర్జరీ తర్వాత రోగులను నైపుణ్యం కలిగిన మల్టీడిసిప్లినరీ బృందం నిశితంగా పర్యవేక్షిస్తాయి. రోగులకు 100 శాతం క్వాలిటీ వైద్యం అందిస్తుంది.

**-నాణ్యమైన న్యూరో వైద్యసేవలు అందిస్తున్నాం**

**వి భాస్కర్, ప్రముఖ మెదడు, వెన్నుముక శస్త్రచికిత్స వైద్య నిపుణులు**



తరచూ తీవ్రమైన తలనొప్పి, ఆకస్మాతుగా చేతులు లేదా కాళ్లలో బలహీనత, నడవడంలో ఇబ్బంది, మాటలు తడబడటం, చూపు మందగించడం, వెన్నునొప్పి తీవ్రంగా ఉండటం, ప్రమాదాల తరువాత తలకు గాయాలు కావడం వంటి లక్షణాలు ఉంటే ఆలస్యంగా చేయకుండా పరీక్షలు చేయించుకోవడం, వైద్యులు సంప్రదించడం చేయాలి. ముఖ్యంగా తలకు గాయమైనప్పుడు చిన్న సమస్యగా భావించకుండా స్కాన్ చేయించుకోవాలి. వెన్నుముక, నరాల ఒత్తిడి ఉన్నప్పుడు స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సూచనల మేరకే చికిత్స తీసుకోవాలి. రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులను నియంత్రణలో ఉంచడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం, సరైన నిద్ర, తేలికపాటి వ్యాయామం చేయడం ద్వారా మెదడు, నరాల ఆరోగ్యాన్ని కాపోడుకోవచ్చు. మరిముఖ్యంగా ప్రయాణాలు చేసేటప్పుడు హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం వల్ల పెద్ద ప్రమాదాల నుంచి రక్షణ పొందవచ్చు.

## విద్యార్థుల్లో దాగున్న నైపుణ్యాలను వెలికి తీయాలి : ఐటిడిఏ పిఓ



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీసేందుకు చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శనివారం దుమ్ముగూడెం మండల పరిధిలోని ఆర్లగూడెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను అయన ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, లైబ్రరీ, డైనింగ్ హాల్, వడ్డిస్తున్న ఆహార పదార్థాలు పరిశీలించారు. నోటుపుస్తకాల పంపిణీ, మండలంలో నడుస్తున్న బడిబాట తదితర కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం తిరిగి వచ్చిన విద్యార్థులకు వాతావరణ మార్పుల మూలంగా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని, విద్యార్థుల మానసిక పరిస్థితిని వివరించి విద్యార్థులకు సకాలంలో వైద్య సేవలు అందించాలన్నారు. వర్షాకాలం నడుస్తున్నందున విద్యార్థుల ఆరోగ్యాల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతీ రోజు వంట గదిని శుభ్రం చేయాలని, వేడివేడి ఆహార పదార్థాలను మాత్రమే విద్యార్థులకు వడ్డించాలని, పాఠశాల ఆవరణ శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పాఠశాల చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా సైడ్ డ్రైన్లు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. అనంతరతం చిన్న ఆర్లగూడెం, కొంగవాగు గుంపు జిపిఎస్ పాఠశాలను పిఓ పరిశీలించారు. అక్కడి పిల్లలచే ఉద్దీపకం పుస్తకాలను చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలకు ఇష్టమైన ఆటపాటలు ఆడిస్తూ వారికి నచ్చిన కళలను ప్రోత్సహించాలన్నారు. సరదాగా పిల్లలతో క్రికెట్ ఆడి దానికి సంబంధించిన మెలుకువలు చిన్నారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సోమశేఖర్, వార్డెన్ లక్ష్మణ రావు, ఎస్సీ ఆర్‌పి విటల్, జిపిఎస్ పాఠశాల హెచ్‌ఎంలు పాపారావు, కన్నారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పినపాక యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యడమకంటి సుధాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి ఖలీల్ అహ్మద్, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి ఆదేశాల మేరకు పినపాక అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా యడమకంటి సుధాకర్‌రెడ్డిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయనకు రాష్ట్ర నాయకత్వం నియామక పత్రాన్ని అందజేసింది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ యువజన కాంగ్రెస్ బలోపేతానికి, యువతను పార్టీ కార్యక్రమాల్లో మరింత క్రియాశీలకంగా భాగస్వామ్యం చేసేందుకు కృషి చేస్తానన్నారు. పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు మార్గదర్శకత్వంలో నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి పని చేస్తానని తెలిపారు. ఈ బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇంచార్జి ఖలీల్ అహ్మద్, రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా మంత్రులు, ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆళ్లపల్లి పీహెచ్‌సీలో చేతి బోరు ప్రారంభం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)ఆవరణలో రోగులు, వారి సహాయకులు తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన చేతి బోరును ఆళ్లపల్లి సర్పంచ్ వాసం సుష్మిత శ్రీకాంత్ ప్రారంభించారు. గత పర్యటనలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు సహకారంతో ఈ బోరు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తమ వంతు కృషి కొనసాగుతుందని నాయకులు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కోప్రచార కమిటీ అధ్యక్షులు వాసం శ్రీకాంత్, ప్రముఖ వ్యాపారవేత్త గౌరిశెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు పానుగంటి మంగ, రామానుజగూడెం సర్పంచ్ మోకాళ్ల చంద్రశేఖర్, నాయకులు తెలంగాని శ్రీను, వళ్లాల నాగం, గొగ్గేల కాంతు, కుంట వెంకటరాములు, వార్డు సభ్యురాలు గౌరబోయిన సీత, పీహెచ్‌సీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ కార్యదర్శి శ్రీకాంత్‌కు ఘన సన్మానం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మేజర్ గ్రామ పంచాయితీ ఇంచార్జ్ కార్యదర్శిగా కందిమళ్ల శ్రీకాంత్ అందించిన సేవలు ఆదర్శప్రాయమని సర్పంచ్ బానోత్ సదర్‌లాల్ అన్నారు. కార్యదర్శిగా ఆయన బాధ్యతల నుంచి రిలీవ్ అవుతున్న సందర్భంగా గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మూడు నెలల పాటు పారిశుద్ధ్యం, తాగునీటి నిర్వహణ, అభివృద్ధి పనులు, పరిపాలనా వ్యవహారాల్లో శ్రీకాంత్ చూపిన చొరవ ప్రశంసనీయమన్నారు. కార్యాలయ సమయాలతో సంబంధం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఉప సర్పంచ్ తుళ్లూరి ప్రకాశ్ రావు మాట్లాడుతూ ప్రజలతో మమేకమై అంకితభావంతో పని చేసిన శ్రీకాంత్ సేవలు అందరికీ ఆదర్శమన్నారు. ఒకే సారి పలు గ్రామ పంచాయితీల బాధ్యతలు నిర్వహిస్తూ సమర్ధవంతమైన పరిపాలన అందించారని తెలిపారు. వార్డు సభ్యులు మొరివినేని చంద్రకళ, వేములపల్లి హసిత ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు చిక్క పద్మ, జరుపుల కౌసల్య, కోర్స ముత్తమ్మ, కణతాల ధనలక్ష్మీ, చిట్టిపల్లి రమాదేవి, ఏఐటీయూసీ నాయకులు ఆర్ రాజేష్, మేకల భాస్కర్, గ్రామ పంచాయితీ సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## తిప్పనపల్లి ఎస్సీ కాలనీ సమస్యలపై నిరసన



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** తిప్పనపల్లి ఎస్సీ కాలనీలో చెత్త సేకరణ చేయాలని, పని చేయని చేతి పంపులకు మరమ్మత్తులు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను నెలకొల్పాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులు శనివారం చెత్తకుప్పల వద్ద, పని చేయని చేతి పంపుల వద్ద నిలబడి తమ నిరసనని తెలియజేశారు. ఈసందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ పంచాయితీ ట్రాక్టర్ ద్వారా ప్రతి రోజూ చెత్త సేకరణ జరగడం లేదని, అడిగితే డీజిల్ లేదని సమాధానం చెబుతున్నారన్నారు. మురుగునీరు గుంతల్లో ఉండి వాసన వస్తున్న కనీసం బ్లీచింగ్ చల్లడం లేదన్నారు. వీధిలైట్లు సైతం పెట్టడం లేదని, చేతిపంపులను బాగు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని సార్లు పంచాయితీ సెక్రటరీకి, సర్పంచ్‌కి తెలియజేసిన పట్టించుకోవడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే పంచాయితీ కార్యాలయం ఎదుట నిరసన చేస్తామన్నారు. నిరసనలో ఎస్సీ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో మూడు పాడి గేదేలు మృతి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** మండల పరిధిలోని బెండాలపాడు గ్రామంలో విద్యుత్ షాక్‌తో మూడు పాడి గేదేలు మృతి చెందాయి. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన గాలివానకి గ్రామ శివారులోని విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. శనివారం ఉదయం గోదా వెంకటేశ్వర్లుకు చెందిన మూడు సూడి గేదేలు మేతకు వెళ్లి, పడిపోయిన విద్యుత్ స్థంభాల తీగలను గమనించకుండా తగలడంతో మూడు సూడి గేదేలు అక్కడికక్కడే మృతి చెందాయి. గేదేలు చనిపోయిన విషయంపై రైతు వెంకటేశ్వర్లు తనను ఆదుకోవాలని, ఆర్థికంగా నష్టపోయానని వాపోయాడు. విద్యుత్ స్థంభాలు పడిపోయిన విద్యుత్ శాఖ అధికారులు కనీసం కరెంటు సరఫరా నిలిపివేయకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## అన్నారం లో వ్యాధి నిరోధక టీకాలు



**ప్రజాపక్షం/మణుగూరుః** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలో గల అన్నారం, బెస్తగూడెం లో పిల్లలకు, గర్భిణీ స్త్రీ లకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగింది. గర్భిణీ స్త్రీ లను త్వరితగతిన గుర్తించి, నమోదు చేసుకొని వారికి టీకాలు ఇప్పించడం, రక్త పరీక్షలు చేయించడం, విధిగా డాక్టర్ చేత చెక్ అప్స్ చేయించడం,చేయించాలని పీహెచ్‌ఎన్ సత్తెమ్మ ఆశా కార్యకర్తల కు దిశా నిర్దేశం చేశారు. అనంతరం గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పై అవగాహనా కల్పించారు. హెల్త్ అసిస్టెంట్లు రాంప్రసాద్, కృష్ణ, వెంకటలక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# త్యాగధనురాలు సత్యవతి

**-సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్**

**ప్రజాపక్షం/బోనకల్:** జీవితాంతం కమ్యూనిస్టుగా బ్రతికి సిపిఐ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసిన యంగల సత్యవతి త్యాగధనురాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ కొనియాడారు. మండలంలోని కలకోట గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు యంగల యేలేషు, మత్స్యశాఖ సోసైటీ మాజీ ఛైర్మన్ యంగల సత్యవతి(73) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆమె సంస్మరణ సభను స్వగృహంలో నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి దండి సురేష్, ఐజెయూ జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కాలంలో కమ్యూనిస్టుగా బ్రతకాలంటే తమ జీవితాన్ని త్యాగం చేయడానికి సిద్ధపడాలన్నారు. తన భర్త యంగల యేలేషుతో పార్టీ ప్రతి కార్యక్రమంలో సత్యవతి పాల్గొనేదని ఆయన గుర్తు చేశారు. తూము ప్రకాశరావుతో పాటు ఆయన సహచరుడు అయిన యంగల రాములు, బ్రాహ్మణపల్లి మాజీ సర్పంచ్ కొంగర అప్పయ్యల సారథ్యంలో సాగిన భూ పోరాటంలో సత్యవతి పాల్గొనిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా తను నమ్మిన సిద్ధాంతం, పట్టుకున్న ఎర్రజెండాను విడువలేదని అన్నారు. యంగల



సత్యవతి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని యువతరానికి ఆయన పిలుపునిచ్చారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిలా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, బెజవాడ రవిబాబు, ఏనుగు గాంధీ, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు మాతంగి శ్రీనివాసరావు, యంగల వెంటకమ్మ, తోటపల్లి ఆనందరావు, సిపిఐ శాఖ కార్యదర్శి యంగల పెద్ద రమేష్, బొమ్మినేని నాగేశ్వరరావు తదితరులున్నారు.

# నీట్ పేపర్ లీకేజీపై కేంద్రం బాధ్యత వహించాలి

**-స్టూడెంట్ వాయిస్ పేరుతో కార్యక్రమం**
**-కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. శనివారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ వల్ల లక్షలాది మంది విద్యార్థులు మానసికంగా ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. పరీక్ష రద్దు కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరాశ, నిస్పృహాలకు గురయ్యారని పలువురు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని ఆయన తెలిపారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పై ఎన్నో అపోహలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్టూడెంట్ వాయిస్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సత్యనారాయణ తెలిపారు. మహిళా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య మాట్లాడుతూ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా ఎంపికై మొదటిసారిగా ఎర్రబెల్లి స్వప్న ఈనెల 22న ఖమ్మంజిల్లాకు విచ్చేస్తున్నారని వారికి స్వాగతం పలుకుతూ సప్తపది ఫంక్షన్ హాల్‌లో నారీబేటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఆర్టీఏ మెంబరు గజ్జెల్లి వెంకన్న, అనుబంధ సంఘాల నాయకులు కొత్తా సీతారాములు, గౌస్, పుచ్చకాయల వీరభద్రం, బొందయ్య, అంజనికుమార్, వినోద, రేఖ, భార్గవి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ కార్మికుల రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

**ప్రజాపక్షం/కల్లూరు:** తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ నాలుగో రాష్ట్ర మహాసభలు ఈనెల 23, 24 తేదీలలో హైదరాబాదులోని కాటేదాన్ రాజేంద్రనగర్ గ్రేటర్ హైదరాబాద్ లో జరుగు మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కల్లూరు లోని మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో మహాసభ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎఐటియుసి ఉపాధ్యక్షులు వేము రాంబాబు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికుల సమస్యల మీద నిరంతరం ఏఐటిసి నాయకత్వన పోరాటాలు, ఉద్యమాలు నిర్వహిస్తున్నామని, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్పొరేషన్లు మరియు మున్సిపాలిటీలలో సుమారుగా 90000 మంది కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎన్ ఎమ్ ఆర్ ఫిక్స్ పే తదితర పద్ధతుల్లో ఉద్యోగులు కార్మికులు పనిచేస్తున్నారని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వ్యవస్థ దోపిడి వ్యవస్థ దుర్మార్గపు శ్రమ దోపిడీ విధానం రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎన్ ఎమ్ ఆర్ ఫిక్స్ పే కార్మికులకు కార్మికులను పర్మినెంట్ చేయాలని, రెండవ పిఆర్సి లో కనీస వేతనం 26,000 నిర్ణయించాలని, రాష్ట్ర ప్రభుత్వమే



బడ్జెట్ కేటాయించి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులకు ఎనిమిది గంటల పని దిన విధానాన్ని అమలుపరచాలని, పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు పండుగ మరియు వారాంతపు సెలవుతో కూడిన సెలవులు అమలు చేయాలని తదితర డిమాండ్లతో ఈ రాష్ట్ర మహాసభ లో నిర్ణయాలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ కార్మికుల జిల్లా కార్యదర్శి వజీర్‌మియా, కార్మిక సంఘ నాయకులు మణిరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు పక్కన ఎండిన చెట్టు..పొంచి ఉన్న ముప్పు..!

**- ఆదమరిస్తే అనంత లోకాలకే..**

**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం:** మండల పరిధిలోని కొక్కిరేణి క్రాస్ రోడ్ సమీపంలో వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ భారీ ఎండిన చెట్టు వాహనదారులు, పాదచారులకు ముప్పుగా మారింది. ఎప్పుడైనా విరిగి పడే ప్రమాదం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వందలాది మంది వాహనదారులు, పాదచారులు నిత్యం రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ఎండిన చెట్టు కొమ్మలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రస్తుతం ఈ దురుగాలులు, వర్షాలు పడుతున్న క్రమంలో భారీ వృక్షం నేలకూలే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరిగిన సంఘటనలూ ఉన్నాయి. ఈ మేరకు సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న వృక్షాలు తొలగించాలని వాహనదారులు, పాదచారులు కోరుతున్నారు.



# ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



**ప్రజాపక్షం ఖమ్మం :** ఖమ్మం నగర పరిధిలోని మల్లెలమడుగు డబుల్ బెడ్‌రూం ఇండ్ల కాలనీలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమైంది. శరత్ మ్యాక్సివిజన్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై కంటి పరీక్షలు చేయించుకుని తగు వైద్య సలహాలు పొందారు. కంటి జబ్బులపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోడా వీరన్న, ఆసుపత్రి సిబ్బంది విక్రంసింగ్, లెనిన్, అనిల్, స్థానికులు షేక్ యాకూబ్, రవిరెడ్డి, నరేష్, ఎల్లమ్మ, నాగమణి, వాణి పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారున్ని ఆదుకోండి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** అనారోగ్యంతో బాధపడుతున్న తెలంగాణ ఉద్యమకారుడు, ముదిరాజ్ సంఘం నాయకుడు ఆకిటి వెంకటేశ్వరరావును ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మలిదశ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారని పాలేరు నియోజక వర్గ వ్యవస్థాపక అధ్యక్షులుగా ఆకిటి పని చేశారని తెలంగాణ ఉద్యమ ఫోరం బాధ్యులు తెలిపారు. ఆర్టీసి ఉద్యోగి అయిన ఆకిటి వెంకటేశ్వరరావు ఉద్యోగాన్ని సైతం పక్కనపెట్టి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. క్యాన్సర్ రూపంలో ఆయన తీవ్ర అనారోగ్యానికి గురయ్యారని ప్రభుత్వం ఆయనను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ముదిరాజుల సంఘం నాయకులు శనివారం ఆయనను పరామర్శించారు. పరామర్శించిన వారిలో మహిళా విభాగం రూరల్ అధ్యక్షురాలు రమాదేవి, ముదిరాజ్ సంఘం నాయకులు రావుల హన్మంతరావు, కొప్పెర జానకిరాములు, ధనలక్ష్మి , సంగమేశ్వరరావు, ఉద్యమకారుల ఫోరం నాయకులు పాలకుర్తి కృష్ణ, మందా వెంకటేశ్వర్లు ఉన్నారు.

# ఫోన్‌పే కోట్టినందుకు ఓ వ్యక్తికి చేదు అనుభవం

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 5వ వార్డుకు చెందిన బిఆర్ఎస్ నాయకుడు బానోత్ మోహన్‌కు చేదు అనుభవం ఎదురయ్యింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం..నెల క్రితం తనఫోన్‌పేకు బావమరిది ఫోన్‌పేతో డబ్బులు వచ్చాయి. వీటిని తన సమీప బంధువైన బావకు ఫోన్‌పే చేశాడు. ఈ నేపథ్యంలో అతనికి కొట్టిన డబ్బులతో పాటు ఇతనవి కూడా అదనంగా డబ్బులు కట్టయ్యాయి. ఏమిటి ఈ పరిణామం అంటూ స్థానిక డీసీబీ బ్యాంక్ మేనేజర్‌ను ఆరా తీశాడు. దీనిపై సదరు మేనేజర్ మీ బావమరిది ద్వారా సైబర్ నేరస్తుడు డబ్బులు కొడుతుండగా ఓ లింకును అందులో పంపించారు. దాంతో ఈ విధంగా జరిగిందంటూ వివరించారు. ఇది ఒక లింకు సిస్టంగా నడుస్తుందని పేర్కొన్నాడు. అలాగే ఈ విషయంపై మోహన్ బావమరిదిన ఏమిటి ఇలా ఒక లింకు సిస్టంగా నడుస్తుందని పేర్కొన్నాడు. అలాగే ఈ విషయంపై మోహన్ బావమరిదిన ఏమిటి ఇలా జరిగింది అనే అడగడంతో అతని ఇచ్చిన సమాధానంతో కంగుతిన్నాడు. అవును నా అకౌంట్ కూడా హ్యాక్ అయ్యింది. నా డబ్బులు కూడా ఓ రాజస్థాన్ అకౌంట్‌కు ట్రాన్స్ఫర్ అయ్యాయి అంటూ సమాధానం ఇచ్చాడు. అప్రమత్తమై తన డీసీబీ అకౌంట్ ఫ్రిజ్ చేయించుకున్నాడు.

# కలకోట డప్పు కళాకారులకు బత్తినేని ట్రస్ట్ చేయూత

**-రూ.50 వేలు విలువ గల డ్రస్‌కోడ్ సామాగ్రి పంపిణీ**



**ప్రజాపక్షం/బోనకల్:** మండలంలోని కలకోట డప్పు కళాకారులకు అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో టీషర్టులు, డ్రస్‌కోడ్‌లను శనివారం పంపిణీ చేశారు. సుమారు రూ. 50 వేల విలువైన సామాగ్రిని తూము ప్రకాశరావు స్మారక స్థూపం వద్ద ట్రస్ట్ సభ్యురాలు, తెలంగాణ రాష్ట్ర మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బత్తినేని నీరజ చేతుల మీదుగా చిందు డప్పు దళ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నీరజ మాట్లాడుతూ జనపద కళలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. డప్పు కళాకారులు తమ కళతో గ్రామీణ సంస్కృతిని సజీవంతగా ఉంచుతున్నారని కొనియాడారు. కళాకారుల సంక్షేమం కోసం బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని, భవిష్యత్‌లో కూడా వారికి అవసరమైన సహాయ సహాకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, మండల కార్యవర్గ సభ్యులు యంగల వెంకటమ్మ, శాఖ కార్యదర్శి యంగల పెద్ద రమేష్, కళాకారులు యంగల ముత్తేషు, యంగల చిన్నరాములు, మనోజ్, తోటపల్లి రాజేష్, మాతంగి శ్రీనివాసరావు, బలుగూరి మోషే, యంగల ప్రసన్నకుమార్, నారపోగు నారయ్య పాల్గొన్నారు.

# అనుమతి లేని ప్రైవేట్ ల్యాబ్, డయాగ్నస్టిక్ సెంటర్ల తనిఖీలు



**ప్రజాపక్షం/ముదిగొండ:** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రవేట్ ల్యాబ్‌లు, డయాగ్నస్టిక్ సెంటర్లను వైద్యాధికారి డాక్టర్ జాలాది నాగేంద్రప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ల్యాబ్‌లలో అనుమతి పత్రాలు, నిర్వహణ రికార్డులను పరిశీలించారుఉ. ప్రభుత్వం నిర్దేశించిన అన్ని అనుమతులు తప్పనిసరిగా పొందాలని నిర్వాహకులకు సూచించారు. నిబంధనలను ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య నిర్ధారణ సేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్ధేశించిన నిబంధనలు ప్రతి ల్యాబ్, డయాగ్నస్టిక్ సెంటర్ తప్పనిసరిగా పాటించాలని వైద్యాధికారి స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో వైద్యాదికారితో పాటు ల్యాబ్ టెక్నిషియన్ రెడ్డి బోయిన రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియలను వేగవంతం చేయండి

**-అక్కినేపల్లి, లింగంపల్లి ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించిన జిల్లా కలెక్టర్ అంకిత్**





**ప్రజాపక్షం/దమ్మపేట:** జిల్లాలో ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే, నాన్, క్యాడస్ట్రల్ సర్వే, నీటి పారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం దమ్మపేట మండలం లోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా దమ్మపేట మండలం అక్కినేపల్లి గ్రామంలో చేపడుతున్న నాన్ క్యాడస్ట్రల్ సర్వే పనులను ఆయన పరిశీలించారు. సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు విధానాలను అడిగి తెలుసుకుని పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం దమ్మపేట మండలం లింగంపల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 1458లో కొనసాగుతున్న ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. ఈసందర్భంగా అధికారులు కలెక్టర్‌కు వివరాలు అందిస్తూ అక్కినేపల్లి గ్రామ పరిధిలో సుమారు 4,400 ఎకరాల విస్తీర్ణంలో ఫారెస్ట్, రెవెన్యూ జాయింట్ సర్వే పనులు కొనసాగుతున్నాయని, ప్రస్తుతం పనులు ప్రణాళిబద్ధంగా జరుగుతున్నాయని తెలిపారు. మరో రెండు నెలల్లో సర్వే ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు వివరించారు. అనంతరం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటి పారుదల శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈసందర్భంగా సీతారామప్రాజెక్ట్ అలైన్‌మెంట్‌ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారలుతో సమగ్రంగా చర్చించారు. ప్రాజెక్టు పనులకు ఎటువంటి అవరోధాలు తలెత్తకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మదు, దమ్మపేట తహసీల్దార్ రామ్ నరేష్, ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావు, సర్వేయర్ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

# రెట్రో రిఫ్లక్టివ్ టేప్ విధానాన్ని రద్దు చేయాలి

**- కంచర్ల జమలయ్య**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రెట్రో రిఫ్లెక్టివ్ టేప్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ఈ విధానం వల్ల ఆటో డ్రైవర్లతో పాటు తీవ్ర ఇబ్బందులు, ఆర్థిక నష్టం కలుగుతోందని ఏఐటీయూసి అనుబంధ ఆటో వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కంచర్ల జమలయ్య డిమాండ్ చేశారు. కొత్తగూడెం పరిధిలోని ఆర్‌టిఏ కార్యాలయం ఎదుట యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించి అనంతరం ఆర్‌టిఏ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జమలయ్య మాట్లాడుతూ మోటారు వాహన చట్టంలో ఎక్కడా లేకపోయినప్పటికీ రవాణాశాఖ కొత్తగా క్యూఆర్ కోడ్ నిబంధనలు చేర్చి ప్రైవేటు కంపెనీల దోపిడీకి ఊతమిస్తోందని మండిపడ్డారు. గతంలో వాహనదారుల ఆందోళనతో వెనక్కి తగ్గిన రవాణాశాఖ మళ్లీ ఇప్పుడు గుట్టుగా ఈ దోపిడీ విధానాన్ని అమల్లోకి తెచ్చిందని విమర్శించారు. సాధారణ రిఫ్లెక్టివ్ కంటే రెట్టింపుధరలతో విక్రయిస్తూ వాహనం చుట్టూ 22 మీటర్ నుండి 26 మీటర్ల వరకు అతికించాలనే నిబంధనతో ఆటోలు, మ్యాక్సీ క్యాబ్‌లు, లారీలు, బస్సుల యజమానులపై వేలాది రూపాయల అదనపు భారం వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ఒకే ఒక్క ప్రైవేటు కంపెనీ లాభాలు చేకూర్చడం కోసమే ఈ దోపిడీ రంగాన్ని సిద్ధం చేశారని, తక్షణమే ఈ నిబంధనలను వెనక్కు తీసుకోవాలని, లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని జమలయ్య హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మద్రి కృష్ణ, చించూ, సురేష్, మోహన్, శ్రీను, సోను, స్వామి పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

**పలు కేసులు రాజీ..**
**నేరం అంగీకరించిన కేసుల్లో జరిమానాలు**




**ప్రజాపక్షం/మణుగూరు:** జాతీయ స్థాయిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో భారీ స్థాయిలో పెండింగ్ కేసుల పరిష్కారం జరిగింది. వివిధ రకాల కేసుల్లో రాజీ, నేర అంగీకారం, జరిమానాల ద్వారా గణనీయ సంఖ్యలో కేసులు పరిష్కారమై, కక్షిదారులకు సమయం, ధన వ్యయం తగ్గడంతో పాటు న్యాయస్థానాలపై ఉన్న భారం కూడా తగ్గిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కంబపు సూరి రెడ్డి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా కేసులను పరస్పర రాజీతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చు అన్నారు. దీనివల్ల కక్షిదారులకు న్యాయస్థానాల చుట్టూ తిరిగే అవసరం తగ్గుతుంది అన్నారు. సమయం, ఆర్థిక భారం రెండూ తగ్గడమే కాకుండా, దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సఖ్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు.

**పలు కేసుల్లో రాజీ..**

మణుగూరు న్యాయస్థానం పరిధిలో పోలీసు, చెక్కు బాకీ, భరణం, గృహ హింస, మద్యం నిషేధ శాఖలకు సంబంధించిన మొత్తం 2,199 కేసులు పెండింగ్‌లో ఉండగా, జాతీయ లోక్ అదాలత్ ద్వారా 147 కేసులు పరిష్కారమయ్యాయి. వాటిలో 94 పోలీసు కేసులు, 2 చెక్ బౌన్స్ కేసులు పరిష్కారం కాగా, అందులో 42 పోలీసు కేసులు పరస్పర రాజీ ద్వారా ముగిశాయి. మిగిలిన 52 కేసుల్లో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో న్యాయస్థానం మొత్తం రూ. 1,15,000 జరిమానా విధించి కేసులను కొట్టివేసింది. మిగతా రెండు షేక్ బౌన్స్ కేసులు ఇరు పక్షాలు రాజీ కుదుర్చుకున్నారు. అలాగే పెట్టి కేసులు 385 పరిష్కారమై రూ.2,16,000 జరిమానా వసూలు చేయగా, ఈపెట్టి కేసులు 213 పరిష్కారమై రూ.24,700 జరిమానా విధించారు. ఇక బ్యాంకుల ముందస్తు వివాద పరిష్కారానికి సంబంధించిన 55 కేసులు పరిష్కారమవగా, సంబంధిత బాకీదారులు మొత్తం రూ.30,27,800 చెల్లించడంతో కేసులు ముగిశాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ మధు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాదులు సంధ్య, నాగార్జున్ రెడ్డి, సర్వేశ్వరరావు, రాము, న్యాయస్థాన సిబ్బంది, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత కక్షిదారులు పాల్గొన్నారు.

## రీ వెరిఫికేషన్‌లో 10మార్కులు పెంపు

**-మండల సెకండ్ టాపర్‌గా నిలిచిన ఎంఎస్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని కే భవ్య**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** 2026 పదో తరగతి వార్షిక పరీక్షల ఫలితాల్లో ఎంఎస్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని కే భవ్య రీ వెరిఫికేషన్ అనంతరం అదనంగా 10 మార్కులు సాధించి మండల స్థాయిలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. మొదట విడుదలైన ఫలితాలపై అనుమానం వ్యక్తం చేసిన విద్యార్థిని కే భవ్య రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకోగా, ఫలితాల పునఃపరిశీలన అనంతరం 10 మార్కులు పెరిగాయి. దీంతో ఆమె మొత్తం 569 మార్కులు సాధించి మండల సెంకడ్ టాపర్‌గా నిలిచింది. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ 2026 పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో తొలి మూడు స్థానాలను ఎంఎస్ఆర్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులే దక్కించుకోవడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. మండల ప్రథమ స్థానం జె కావ్యశ్రీ(571), ద్వితీయ స్థానం కే భవ్య(569), తృతీయ స్థానం సీహెచ్ ఆశ్రేష(567)మార్కులు సాధించి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చారని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం ఈ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.

## వాగులో పడి విద్యార్థి మృతి



**ప్రజాపక్షం/గుండాల :** మండల పరిదిలోని రోళ్ళగడ్డ పంచాయితి నర్సాపురం తండాకు చెందిన గుగులోత్ దేవా,కల్పన ల కుమారుడు షీమాన్(9) వాగులోపడి మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. తండాలో దుర్గామాత విగ్రహప్రతిష్ఠ శనివారంనుండి పూజకార్యక్రమాలు జరుగుతుండగా గ్రామస్తులంత ప్రతిష్ఠ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్న సందర్భంలో షీమాన్ తన స్నేహితులతో పక్కనే ఉన్న మల్లన్న వాగులో సరదాగా ఈతకు వెల్లగా ఈత రాక మునిగి పోయాడు, పక్కనే తోటి స్నేహితుడు గ్రామస్తులు తెలపడంతో హుటాహుటిన వెల్లి రెండు మూడు గంటలు గాలించి మృత దేహాన్ని వెలికి తీయడంతో తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి ,దీనితో గ్రామంలో విశాద చాయలు అలముకున్నాయి. షిమాన్ ఇల్లందు ప్రవేటి పాశాలలో 5వ తరగతి పూర్తి చేశాడు. దీనితో దుర్గామాత విగ్రహప్రతిష్ట కార్యక్రమాని విచ్చేసిన తండా వాసులంత దిగ్‌భ్రాంతిని వ్యక్తం చేశారు.

## చాట్ల వనజ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పాయం



**ప్రజాపక్షం/గుండాల :** ఇటీవల సకాలంలో వైద్యం అందక మృతిచెందిన చాట్ల వనజ కుటుంబాన్ని పినపాక నియోజకవర్గశాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు శనివారం శంభునిగూడెం గ్రామానికి వెల్లి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ పందర్బంగా కుటుంబానికి దైర్యంచెబుతూ ,ప్రభుత్వం తరపున అన్నివిదాలుగా అండగా ఉంటామని హామి ఇచ్చారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రిగారి దృష్టికి తీసుకెల్లి కుటుంబానికి తగిన న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. వనజ మరణానికి సంబందిచిన ఘటనపై సమగ్ర విచారన జరిపించి బాద్యులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వదృష్టికి తీసుకెల్తానన్నారు. మండల కేంద్రానికి విచ్చేసి పిహెచ్‌సి వైద్యునితో మాట్లావి విషయం తెలుసుకున్నారు. అలాగే రాష్టవైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ సుదీరాగారిని కలసి గుండాల పిహెచ్‌సికి సిబ్బంది కొరత లేకుండా పూర్తి స్థాయిలో సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు పి ముత్తయ్య, ఎస్కె ఖదీర్ , ఊకె బచ్చయ్య, దారా అశోక్, సర్పంచి ఈసం సుమలత, కల్తి క్రిష్ణవేణి, భూక్యశ్రీను, అబ్దుల్‌నబివాజీద్, ఎం కిరన్, వాంకుడోత్ బీకోజి, పాల్గొన్నారు.

## రైతులను వెన్నుపోటు పొడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం




**ప్రజాపక్షం/బూర్గంపాడు :** తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని, ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తి విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు ఆదేశాల మేరకు సారపాకలో నిర్వహించిన సమావేశంలో బీఆర్ఎస్ టౌన్ అధ్యక్షుడు కొనకంచి శ్రీనివాసరావు మాట్లాడారు. రైతుబంధును రూ 15వేలకు పెంచుతామని, అన్ని పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేసి బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిరాశపరిచిందని ఆరోపించారు. 24గంటల ఉచిత విద్యుత్, రైతు భీమా, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో రైతుబంధు, రైతుభీమా, రుణమాఫీ, సాగునీటి ప్రాజెక్టుల ద్వారా రైతులకు పెద్ద ఎత్తున లబ్ది చేకూరిందని గుర్తు చేశారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేయకపోతే రైతులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టి జంగ్ సైరస్ మోగిస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో సారపాక బీఆర్ఎస్ యుజన అధ్యక్షుడు సోము లక్ష్మీ చైతన్య రెడ్డి, పాలకవర్గ సభ్యులు తిరుపతి ఏసోబు, యువజన నాయకుడు చల్లకోటి పూర్ణచంద్రరావు, మాజీ వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ బానోత్ శ్రీను, నాయకులు కరి నాగేశ్వరరావు, పంగి సురేష్, సూదిపాక ఈశ్వర్, చట్టూ ఆంజనేయులు, దాసరి మోహన్‌రావు, బెజ్జంకి కనకాచారి, తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సభకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలి

-రైతు మేళాను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలి
-రైతుమేళా, ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** చింతకాని మండలంలో రైతుమేళా సందర్భంగా ఈనెల 30న ముఖ్యమంత్రి పాల్గొనే సభకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే రైతుమేళా, ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలెక్టర్ దివాకర టిఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో మధిర నియోజక వర్గం చింతకాని మండలంలో రైతు మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 150 స్టాల్స్ ఏర్పాటు చేసే ఈ మేళాకు జిల్లా నుండి రైతులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆధునీక సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయాన్ని పండుగలా మార్చుకోవాలని ఈ అవకాశాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. శాస్త్రవేత్తలు రైతు మేళాలో పాల్గొననున్నందున వారికి బస, రవాణా ఏర్పాట్లు చేయాలన్నారు. మేళాకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. 30న జరిగే ముఖ్యమంత్రి సభకు కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో శ్రీరామ్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి పురందర్, జిల్లా ఉద్యాన వన అధికారి మధుసూదన్, జిల్లా మత్స్యశాఖాధికారి మల్లేశం, పిడి మెప్మా, అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వైఫల్యాలపై బిఆర్ఎస్ శంఖారావం

-ఫుడ్ పార్క్ భూముల కేటాయింపుపై విచారణ జరిపించాలి
-ఈనెల 24న కేటిఆర్ సత్తుపల్లిలో పర్యటన
-మీడియా సమావేశంలో ఎంఎల్‌సి తాతా, మాజీ ఎంఎల్‌ఎ సండ్ర



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్:** కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బిఆర్ఎస్ శంఖారావం పూరిస్తుందని ఎంఎల్‌సి, బిఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు తాతా మధుసూదన్ తెలిపారు. శనివారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ ఎంఎల్‌ఎ సండ్ర వెంకటవీరయ్య లు మాట్లాడుతూ తెలంగాణ సాధన నుండి నేటి వరకు బిఆర్ఎస్ రైతాంగ పక్షపాతిగానే పని చేసిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా సాగిన పోరాటం వల్లే నేడు తెలంగాణ సస్యశ్యామలం అయిందన్నారు. కేసిఆర్ అధికారం చేపట్టిన వెంటనే సాగునీరు, వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చారన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా 40వేల చెరువులను పునరుద్దరించారన్నారు. కూసుమంచి, తిరుమలాయపాలెం, రూరల్ మండలాల సాగునీటి కష్టాలు తీర్చేందుకు తొమ్మిది నెలల్లో భక్తరామదాసు ప్రాజెక్టును ఏర్పాటు చేశారన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు బిఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని 90 శాతం పనులు కూడా పూర్తయ్యాయన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దానిని విస్మరించిందన్నారు. ఎన్నికల సమయంలో వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట హామీలు ఇచ్చి వాటిని విస్మరించిందన్నారు. సత్తుపల్లి నియోజక వర్గ పరిధిలోని బుగ్గపాడు ఫుడ్ పార్క్ భూముల కేటాయింపులో భారీ కుంభకోణం చోటు చేసుకుందని దానిపై సమగ్ర విచారణ జరిపించాలన్నారు. ఈనెల 24న సత్తుపల్లిలో బిఆర్ఎస్ సంస్థాగత శిక్షణా శిబిరానికి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆర్‌జెసి కృష్ణ, బిచ్చాల తిరుమలరావు, బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, ఉన్నం బ్రహ్మయ్య, వీరన్న, బొమ్మెర రామ్మూర్తి , నాయకులు పాల్గొన్నారు.

# అప్పులు ఎగవేసేందుకు ఐపీ దాఖలు

ఆస్తుల విక్రయానికి యత్నం
లబోదిబోమంటున్న రుణదాతలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని బి.గంగారం గ్రామానికి చెందిన, మెస్సర్స్ రామకృష్ణ ట్రేడర్స్ పేరుతో ఎరువుల వ్యాపారం నిర్వహిస్తున్న ముల్లంగి సాంబశివారెడ్డి తమ వద్ద భారీ మొత్తంలో అప్పులు తీసుకుని తిరిగి చెల్లించకుండా మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నారని పలువురు రుణదాతలు ఆరోపించారు. శనివారం గంగారంలోని సాంబశివారెడ్డి ఎరువుల షాపు వద్ద రుణదాతలు ఆందోళన చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... వ్యాపార అవసరాలు, కుటుంబ అవసరాల పేరుతో సాంబశివారెడ్డి ఒకరికి తెలియకుండా మరొకరి వద్ద సుమారు రూ.2 కోట్ల మేర అప్పులు తీసుకున్నారని తెలిపారు. అప్పులకు భరోసాగా ప్రామిసరీ నోట్లు, చెక్కులు కూడా అందజేశారని పేర్కొన్నారు. స్థానికంగా పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహించడం, స్థిరాస్తులు కలిగి ఉండటంతో అతనిపై నమ్మకం ఉంచి అప్పులు ఇచ్చామని తెలిపారు.అయితే నిర్ణీత గడువులో అప్పులు తిరిగి చెల్లించకపోవడంతో స్థానికంగా ఆరా తీయగా, మరెందరికో కూడా అతను భారీ మొత్తంలో బకాయిలు ఉన్నట్లు తెలిసిందని రుణదాతలు వెల్లడించారు. తమకు రావాల్సిన నగదు గురించి పలుమార్లు అడిగినా స్పందించకపోవడంతో పాటు, బకాయిలు చెల్లించకుండా తప్పించుకునే ఉద్దేశంతో గౌరవ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, సత్తుపల్లిలో ఇన్‌సాల్వెన్సీ పిటిషన్ (ఐపీ) దాఖలు చేసినట్లు ఆరోపించారు.అదే సమయంలో ఐపీ పిటిషన్‌లో తన ఆస్తుల వివరాలను కోర్టుకు సమర్పించినప్పటికీ, ప్రస్తుతం ఆ ఆస్తులను ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, దీనివల్ల తమకు రావాల్సిన బకాయిలు తిరిగి పొందే అవకాశాలు దెబ్బతింటున్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. సాంబశివారెడ్డి చర్యల వల్ల తాము తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొంటున్నామని, సంబంధిత అధికారులు, న్యాయస్థానం జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని రుణదాతలు కోరుతున్నారు.

# విద్యార్థి ఆదిత్యకు అండగా నిలిచిన నూతి దంపతులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండల పుణ్యపురం గ్రామానికి చెందిన కంభంపాటి విజయ్‌కుమార్ కొడుకు కంభంపాటి ఆదిత్య భాసర ట్రిబుల్ ఐటిలో సీట్ సాధించిన విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రేస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, విజయరాణి దంపతులు విఆ్యర్థి ఆదిత్యకు చదువుల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణగౌడ్ మాట్లాడుతూ పేద విద్యార్థి ఆదిత్యకు ప్రతిఒక్కరూ అండగా నిలవాలని, చదువు కోసం నిరంతరం కష్టపడుతూ ఉన్నతస్థాయికి ఎదగాలని కోరకతో పట్టుదలతో చదివి బాసర ట్రిబుల్ ఐటిలో సీటు సాధించాడని, అలాంటి విద్యార్థికి భవిష్యత్తులో కూడా అండగా ఉంటామని తెలిపారు. సేవా హృదయంతో ధాతలు ముందు కొచ్చి ఆదిత్యకు ఆర్థిక చేయూతను అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ముళ్ళపాటి విజయ, కాంగ్రేస్ రాష్ట్ర నాయకులు బాలాజినాయక్, జిల్లా కాంగ్రేస్ మెడికల్ చైర్మన్ కాపా మురళీకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, వుండ్రు శ్యామ్‌బాబు, వేముల రత్నాకర్, వేల్పుల మురళి, రాజమండ్రి నాగరాజు, పెద్దప్రోలు లక్ష్మయ్య, దేవరకొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** జిల్లాలో అటవీరెవెన్యూ జాయింట్ సర్వే, నాన్ క్యాడస్ట్రల్ సర్వే, నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలను వేగవంత చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. దమ్మపేట మండలంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియ, భూముల హద్దుల గుర్తింపు, రికార్డుల నమోదు వివరాలను పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే పనులు నిర్వమించాలని అధికారులకు సూచించారు. అనంతరం దమ్మపేట తహసీల్దార్ కార్యాలయంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై సీతారామ ప్రాజెక్టు అలైన్‌మెంట్‌ను మ్యాప్ ద్వారా పరిశీలించి, ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ సర్వే, సరిహద్దుల నిర్ధారణ అంశాలపై అధికారులతో సమగ్రమంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం రెవెన్యూ డివిజనల్ అధికారి మధు, దమ్మపేట తహసీల్ధార్ రామ్ నరేశ్, ఫారెస్టు రేంజర్ శ్రీనివాస్‌రావు, సర్వేయర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బుగ్గపాడులో అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లు, మద్యం బాటిళ్లు స్వాధీనం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని బుగ్గపాడు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన గ్యాస్ సిలిండర్లు, భారీ మొత్తంలో మద్యం బాటిళ్లను పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం... బుగ్గపాడు గ్రామంలోని ఓ ఇంట్లో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా గ్యాస్ సిలిండర్లు, మద్యం బాటిళ్లు నిల్వ ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో ఏసీపీ కల్లూరు వసుంధర యాదవ్ ఆదేశాల మేరకు ఎస్ఐ అశోక్ కుమార్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. గ్రామంలోని ఇంటి నంబర్ 92/1లో తనిఖీలు చేపట్టగా 20 గ్యాస్ సిలిండర్లు, 730 మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.1,45,413గా అంచనా వేశారు. స్వాధీనం చేసుకున్న వస్తువులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ కేసులో దూపకుంట్ల వీర రాఘవులు (50), సాదు రాధికపై కేసు నమోదు చేశారు. కిరాణా వ్యాపారంతో వచ్చే ఆదాయం సరిపోకపోవడంతో గ్యాస్ సిలిండర్లు, మద్యం బాటిళ్లను సత్తుపల్లి నుంచి తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.స్టేషన్ హౌస్ ఆఫీసర్ తుమ్మలపల్లి శ్రీహరి ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించి, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న వి.బి.జి రామ్‌జీ పథకాన్ని రద్దు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఖమ్మం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి దండు ఆదినారాయణ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిదిలోని బేతపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూన్ 23న ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ముందు నిర్వహించనున్న ధర్నాను పెద్దఎత్తున జయప్రదం చేయాలని ఆయన ఉపాధి కూలీలకు విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో ఉపాధి కూలీలు పుల్లమ్మ, వెంకటమ్మ, రాధమ్మ, సత్యవతి, నాగమణి, రాములమ్మ, సత్యం, వెంకటేశ్వరమ్మ, తులసమ్మ, కుమారి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల వినూత్న నిరసన



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరుతూ గత రెండు రోజులుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జర్నలిస్టులు మూడో రోజు శనివారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశానికి హాజరైన జర్నలిస్టులు సమావేశ మందిరంలో కూర్చోకుండా నిల్చొని తమ నిరసనను తెలియజేశారు. సమస్యల పరిష్కారం కోసం సోమవారం జర్నలిస్టులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలుస్తానని హామీ ఇచ్చారు. అలాగే జర్నలిస్టుల సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల సంక్షేమం పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించేలా తన వంతు ప్రయత్నం చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు తమ డిమాండ్ల సాధన వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీపై ఆశాభావం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకుందాం



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం తాటిపూడి గ్రామంలో శనివారం తాటిపూడి గ్రామ సర్పంచ్ జవ్వాజి నాగరాజు గ్రామంలోని రోడ్ల ప్రక్కన ఉన్న డ్రైనేజీ పూడిక తీసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ జవ్వాజి అశ్విని మాట్లాడుతూ గ్రామ ప్రజలు డ్రైనేజీలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎవరు పూడ్చవద్దని విజ్ఞప్తి చేశారు. మన పరిసరాల శుభ్రత పైనే మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని ఆమె తెలిపారు.